సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం ၊ 21 ၊ ఏప్రిల్ ၊ 2025



అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో అగ్నిప్రమాదాల పట్ల నిరంతరం అప్రమత్తంగా వుండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలియజేశారు. -8లో



దైవదర్శనానికి వెళ్లి వస్తూ...

నెల్లూరు జిల్లాలోని పెంచల కోనకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇరువురు బద్వేలు వాసులు మృతిచెందారు. -8లో

గరిష్టం/కనిష్టం
38.8/26.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 26.8 - 38.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

వైవీయూ స్నాతకోత్సవ నోటిఫికేషన్

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయ 11,12,13,14వ స్నాతకోత్సవాలను (కాన్వకేషన్స్) జూన్, జులై నెలల్లో నిర్వహించనున్నట్లు వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు వెల్లడించారు. ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస రావు స్నాతకోత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగి వేమన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం నోటిఫికేషన్ కోసం http://convocation.yvuexams.inను సందర్శించాలని సూచించారు. గతేడాది ఏప్రిల్, 2024లో షెడ్యూల్ చేసిన 11, 12, 13వ స్నాతకోత్సవ నిర్వహణ అనివార్య కారణాల వల్ల జాప్యం జరిగిన విషయం తెలిసిందే.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహించనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చని వివరించారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో సూచించారు.

గంగమ్మా..కాపాడమ్మా



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: గంగమ్మా.. వర్షాలు కురిపించి.. కరుణించి కాపాడు తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మకు ఆదివారం భక్తు లు బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. చుట్టు పక్కల వారే కాకుండా ఇతర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చిఅమ్మవారిని దర్శించుకున్నారు. పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆది నుంచి నియంతృత్వమే!

- వైఎస్సార్‌సీపీని బూచిగా చూపెట్టి తన చర్యను సమర్థించుకున్న బీజేపీ ఎమ్మెల్యే ఆది
- యాజమాన్యంతో సంప్రదించాల్సిన ధోరణి అదేనా!
- ఎమ్మెల్యేకి ప్రజాస్వామ్య పద్ధతులు ఉండవా...
- నిలదీస్తున్న ప్రజాస్వామ్యవాదులు

సాక్షి ప్రతినిధి, కడప: ఆయన కూటమి ఎమ్మెల్యే. పూటకో మాట.. రోజుకో రంగు మార్చడంలో ఆరితేరిన వ్యక్తి. 'ఆది'నుంచి.. నియంతృత్వ ధోరణే. స్వపక్షనేతలతో కయ్యానికి దిగుతూ విపక్షంపై వేలెత్తి చూపించడంలో దిట్ట. అక్రమ ఆదాయం కోసం అర్రులు చాస్తూ వైఎస్సార్‌సీపీని బూచిగా చూపెట్టి అకృత్యాలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నవ్వుల పాలవుతున్నారు. ఓవైపు ప్రభుత్వ పెద్దల వద్ద పట్టు కోల్పోగా మరోవైపు క్షేత్రస్థాయిలో సమర్థించుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఆయనే జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆది.

- జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిపై ఇటీవల కాలంలో ప్రధానంగా మూడు వివాదాలు తెరపైకి వచ్చాయి. గండికోట రిజర్వాయర్ ఆధారంగా వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు సివిల్ పనులు తన బంధువులను పంపించి అడ్డుకున్నారు. అక్కడున్న సిబ్బందిపై దాడులకు తెగబడ్డారు. మిషనరీ ధ్వంసం చేశారు. ఇక రెండోది ఆర్టీపీపీ నుంచి సరఫరా అవుతోన్న ఫ్లయాష్ ట్యాంకర్లు అడ్డుకున్నారు. తాము చెప్పిన సూచించిన ట్యాంకర్లు నుంచే ఫ్లైయాష్ సరఫరా చేయాలని హుకుం జారీ చేశారు. తాజాగా అల్ట్రాటెక్ సిమెంటు పరిశ్రమకు సరఫరా చేస్తున్న ముడి ఖనిజం రవాణా చేస్తున్న లారీలను అడ్డగించి సిమెంటు ఉత్పత్తికి ఆటంకం కల్గించారు. ఈ మూడు ఘటనల వ్యవహారంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీ వర్గీయులంటూ ఆ పార్టీ పేరు వాడుకొని ఎదురుదాడి చేశారు.



ఫ్లైయాష్ ట్రాన్సుపోర్టులో టీడీపీ ఎమ్మెల్యే...

ఆర్టీపీపీ నుంచి ప్రతిరోజు 3,926 టన్నులు ఫ్లైయాష్ ఉత్పత్తి అవుతోంది. దానిని 25 ప్రైవేటు కంపెనీలకు, 15 సిమెంటు పరిశ్రమలకు కేటాయిస్తున్నారు. ప్రైవేటు సంస్థలకు టన్ను రూ.550 చొప్పున, సిమెంటు పరిశ్రమలకు టన్ను రూ.410 చొప్పున ఇచ్చేలా అగ్రిమెంటు చేసుకున్నారు. తాడిపత్రిలో ఉన్న ఎల్అండ్‌టీ సిమెంటు పరిశ్రమకు తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి తండ్రి జేసీ ప్రభాకర్‌రెడ్డికి చెందిన ట్యాంకర్లు ఫ్లైయాష్ సరఫరా చేస్తున్నాయి. తాడిపత్రికి కూడా తమ వర్గీయుల ట్యాంకర్లు ద్వారానే ఫ్లైయాష్ సరఫరా చేయాలంటూ ఎమ్మెల్యే మంకుపట్టు పట్టారు. ఈక్రమంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి ట్యాంకర్లకు లోడింగ్ చేయకుండా అడ్డుకున్నారు. అదే స్థాయిలో జేసీ ప్రభాకరరెడ్డి ప్రతిఘటించారు. ఈవ్యవహారం ఉద్రిక్తతల నేపథ్యంలో మరోమారు సీఎం చంద్రబాబు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

అల్ట్రాటెక్ ముడి ఖనిజం ట్రాన్సుపోర్టు కాంట్రాక్టులో ఎంపీ రమణారెడ్డి..

ఎర్రగుంట్ల మండలం చిలంకూరు పరిధిలో ఉన్న అల్ట్రాటెక్ (ఐసీఎల్) సిమెంటు పరిశ్రమకు ఫ్లయాష్, సున్నపురాయి ఇతర ముడి ఖనిజం సరఫరా, ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టు పనులు 40 ఏళ్లుగా మాజీ మంత్రి మైసూరారెడ్డి సోదరుడు ఎంపీ రమణారెడ్డి చేస్తున్నారు. ఆ పనులన్నీ తమ వర్గీయులకే ఇవ్వాలంటూ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కొంతకాలంగా సిమెంటు పరిశ్రమ యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఎలాంటి వివాదం లేని కారణంగా ఆ పరిశ్రమ యాజమాన్యం నుంచి ఎమ్మెల్యే డిమాండ్‌కు ఆశించిన స్థాయిలో మద్దతు కొరవడింది. దాంతో ఏకంగా తన వర్గీయులతో ట్రాన్సుపోర్టు వాహనాలను అడ్డుకున్నారు. సిమెంటు ఉత్పత్తికి కావాల్సిన ముడి ఖనిజం సరఫరా నిలిచి పోవడంతో ఉత్పత్తి ఆగిపోయింది. ఇలాంటి తరుణంలో ఆ సంస్థ యాజమాన్యం హైలెవెల్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో సీఎంఓ జోక్యం చేసుకుంది. కలెక్టరేట్ ఆగమేఘలపై స్పందించి అడ్డుకున్నవారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఎలాంటి ఆటంకం లేకుండా వ్యవహరించింది.

రమేష్‌నాయుడు బీజేపీ ఎంపీ...

గండికోట ప్రాజెక్టు ఆధారంగా కొండాపురం మండలంలోని దొబ్బుడుపల్లె, రావికుంట, తిరువాలయపల్లె గ్రామాలతోపాటు మైలవరం మండలంలోని బొగ్గులపల్లె అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వ అనుమతులు దక్కాయి. తొలివిడతగా రూ.1800 కోట్లతో నిర్మాణ పనులకు ఆసంస్థ శ్రీకారం చుట్టింది. టెండర్లల్లో అనకాపల్లె ఎంపీ రమేష్‌నాయుడుకు చెందిన రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు సివిల్ పనులు దక్కాయి. క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టారు. ఈపనులను తమ వర్గీయులే చేయాలంటూ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పట్టు బట్టారు. ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సోదరుడు శివనారాయణరెడ్డి, మరో సోదరుడు కుమారుడు రాజేష్ రెడ్డి నేతృత్వంలో మందీ మార్బలంతో వెళ్లి దొబ్బుడుపల్లె వద్ద చేపడుతున్న నిర్మాణ పనుల్లో విధ్వంసం సృష్టించారు. అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అడ్డుకుంటున్న వైనాన్ని రిత్విక్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధి రాజేషనాయుడు సీఎం చంద్రబాబు నాయుడుకు మొరపెట్టుకున్నారు.

ముగ్గురూ.. కూటమి నేతలే కదా!

ఈ ఘటనల్లోని ముగ్గురు 'కూటమి'నాయకులే. ఒకరేమో బీజేపీ పార్లమెంటు సభ్యుడు , మరొకరు తాడిపత్రి టీడీపీ ఎమ్మెల్యే, ఇంకొకరు చంద్రబాబు నాయకత్వాన్ని సమర్థించిన మాజీ మంత్రి మైసూరారెడ్డి సోదరుడు. ఈముగ్గురు కూడా వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేని వారే. పైగా కూటమి నాయకులే. కాగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి 'మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కినట్లు'గా స్వపక్షనేతలపై కాలుదువ్వుతూనే వైఎస్సార్‌సీపీని బూచిగా చూపెడుతున్నారని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఆదాయ మార్గాలు తమకు మాత్రమే ఉండాలి. జమ్మలమడుగు ప్రాంతం తమదే.. తాము ప్రాతినిథ్యం వహిస్తున్న ఏరియాలో ఇతరులెవ్వరూ కాంట్రాక్టు పనులు చేయవద్దనే నియంతృత్వ ధోరణిని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రదర్శిస్తున్నారని విశ్లేషకులు ఘాటుగా విమర్శిస్తున్నారు.

డీఎస్సీకి ఉచిత కోచింగ్



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్: యూటీఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. డీఎస్సీ బోధనలో ఉభయ రాష్ట్రాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంచే ఉచిత డీఎస్సీ కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ నిర్వహిస్తున్న ఉచిత డీఎస్సీ కోచింగ్ ఎంతో ఉపయోగకరమని.. అభ్యర్థులకు ఇది ఒక సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డీఎస్సీ బోధనలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఉపాధ్యాయ బృందం కోవెల ప్రసాద్‌రెడ్డి (ఇంగ్లిష్), సిరివెల జయశంకర్ (తెలుగు), సుబ్బారెడ్డి (గణితం), శ్రీనివాసులు (బయలాజికల్ సైన్స్), సత్యానందరెడ్డి (ఫిజికల్ సైన్స్), మస్తాన్ (ట్రై మెథడ్స్) షేక్ షంషుద్దీన్ (సైకాలజీ) మహేష్ (జీకే - కరెంట్ అఫైర్స్) అనే ఉపాధ్యాయులు బోధిస్తారని వివరించారు. ఈనెల 24వ తేదీ ఉదయం 9:30 గంటలకు ఫ్రీ డెమో తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులకు కడప జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 23వ తేదీలోపు కె.నరసింహారావు : 9440384701, గాజులపల్లి గోపీనాథ్ :9885125056 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



కడప సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు



దైవ సందేశం అందజేస్తున్న బిషప్ ఐజక్ వరప్రసాద్

తన పునరుత్థానంతో తానే జీవమునని క్రీస్తు ప్రపంచానికి చాటారని మత గురువులు అన్నారు. జిల్లా వ్యాప్తంగా 'ఈస్టర్ ఆదివారం' వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కడప నగరంతో పాటు జిల్లాలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పలుచోట్ల అర్ధరాత్రి నుంచి మరికొన్నిచోట్ల తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవ గురువులు ఈస్టర్ విశేషాలను తెలిపారు.
- కడప కల్చరల్

డీఎస్సీ శిక్షణ వైపు పరుగులు

- పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- కోచింగ్‌సెంటర్లలో మొదలైన హడావుడి
- ఉచిత కోచింగ్‌కు సన్నాహాలు చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- జిల్లాలో 705 పోస్టుల భర్తీకి అవకాశం



కోచింగ్ తీసుకుంటున్న డీఎస్సీ అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ అభ్యర్థుల ఎదురుచూపులు ఫలించాయి. ఆశలు మళ్లీ చిగురించాయి. ఎన్నాళ్లుగా ఎదురుచూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ ఎట్టకేలకు విడుదల అయింది. ఇప్పటికే చాలా మంది డీఎస్సీ అభ్యర్థులు వేలకు వేలు ఖర్చు పెట్టుకుని నెలల తరబడి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు.

ఇన్నాళ్లు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు ఇక కోచింగ్ సెంటర్లకు పరుగులు తీయనున్నారు. దీంతోపాటు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌ను ఇచ్చేందుకు సిద్ధమవుతుండడం విశేషం.

జిల్లాలో ఖాళీ పోస్టుల వివరాలు...

సబెక్టు	పోస్టులు
ఎస్‌ఏ లాంగ్వేజ్	34
ఎస్‌ఏ హిందీ	18
ఎస్‌ఏ ఇంగ్లిష్	81
ఎస్‌ఏ మ్యాథ్స్	44
ఎస్‌ఏ పీఎస్	30
ఎస్‌ఏ బీఎస్	53
ఎస్‌ఏ సోషియల్	65
ఎస్‌పీ పీఈ	82
ఎస్‌జీటీ	298
మొత్తం	705


జిల్లాలో 705 పోస్టులు.. ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో 705 ఉపాధ్యాయ పోస్టులు ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, మండల ప్రజా పరిషత్తు, మున్సిపాలిటి పరిధిలో భర్తీకానున్నాయి. ఇందులో 407 పోస్టులు స్కూల్ అసిస్టెంట్ పోస్టులుకాగా 298 సెకండ్ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ) పోస్టులు భర్తీకానున్నాయి. ఇందులో 219 తెలుగు మీడియం ఎస్‌జీటీ, 31 ఉర్దూ ఎస్‌జీటీ, 21 ఎస్‌జీటీ మున్సిపాలిటి, 07 ఉర్దూ ఎస్‌జీటీ, 12 కార్పొరేషన్ ఎస్‌జీటీ, ఎస్‌జీటీ ఉర్దూ 8 పోస్టులు భర్తీకానున్నట్లు తెలిసింది. అలాగే స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ ఉర్దూ 06, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 79, స్కూల్ అసిస్టెంట్ హిందీ 16, స్కూల్ అసిస్టెంట్ తెలుగు 26, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ 42, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్సు 28, స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ ఫిజికల్ సైన్సు 02, స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ తెలుగు మీడియం 49, బయలాజికల్ సైన్సు ఉర్దూ మీడియం 02, తెలుగు మీడియం సోషియల్ 58, ఉర్దూ 05, ఫిజికల్ సైన్సు ఉర్దూ 07 పోస్టులు భర్తీకానున్నాయి.

20 నుంచి...మే 15 వరకు..

ఈ నెల 20 నుంచే మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ మే 15వ తేదీ వరకు ఉంటుంది. జూన్ 6 నుంచి జులై 6 వరకు సీబీటీ (కంప్యూటర్ బేస్‌డ్ టెస్ట్) విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతోపాటు డీఎస్సీ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం, జీవోలు, ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, పరీక్షల షెడ్యూల్, సిలబస్, నోటికేషన్ కోసం వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు htpp:// cse.ap.go.inతోపాటు htpp://apdsc.apcfss.inలో అందుబాటులో ఉంచనున్నట్లు విద్యాశాఖ పేర్కొంది.

నిర్లక్ష్యపు నీడలు!

- టీటీడీలోకి విలీనమైనా మారని సౌమ్యనాథాలయం పరిస్థితి
- కన్నెత్తిచూడని టీటీడీ చైర్మన్, ఈఓలు
- శనివారం భక్తుల ఆకలి తీర్చని టీటీడీ





నందలూరులోని సౌమ్యనాథాలయం (ఇన్‌సెట్) స్వామివారి మూలవిరాట్టు

రాజంపేట: దక్షిణాది రాష్ట్రాల్లోని వైష్ణవ ఆలయాల్లో అతిపెద్దది చోళుల కాలంనాటి సౌమ్యనాథాలయం. ఈ ఆలయంపై టీటీడీ నిర్లక్ష్యపు నీడలు వెంటాడుతున్నాయి. టీటీడీ దీనిని పేరుకే విలీనం చేసుకున్నట్లు కనిపిస్తోందని భక్తులు పెదవి విరిస్తున్నారు. సెంట్రల్ ఆర్కియాలజీ, టీటీడీ మధ్య సమన్వయం కొరవడటంతో ఆలయ అభివృద్ధి అటకెక్కిందనే విమర్శలు ఉన్నాయి. టీటీడీ, కేంద్రపురావస్తుశాఖ మధ్య సమన్వయం లేకపోవడమే దీనికి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆలయంలో కల్యాణవేదిక, పరిపాలనగదులు, పోటు, సిబ్బంది గదులు నిర్మించడానికి కూడా అభ్యంతరాలు పుట్టుకొచ్చాయి. దీంతో రేకులషెడ్ నిర్మితం చేసుకున్నారు. ఆలయంలో భక్తుల సౌకర్యాల విషయంలో కూడా నిర్లక్ష్యధోరణే కనిపిస్తోంది.. ఇప్పటికే ఆలయంలో సెంట్రల్ ఏసీతోపాటు అంతరాలయంలో ఏసీ తదితర సౌకర్యాల కల్పన దిశగా వచ్చిన పరికరాలు మూలనపడేశారు.

పేరుకే విలీనం: 2022లో తిరుమల తిరుపతి దేవస్థానంలోకి సౌమ్యనాథాలయం విలీనమైంది. ఒంటిమిట్ట రామాలయం తర్వాత దీనిని విలీనం చేసుకున్నారు. ఇక ఆలయం అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్న భక్తుల ఆశలు అడియాసలయ్యాయి. ఈ ఆలయం వైపు టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో, జేఈవోలు కనీసం కన్నెత్తిచూడటంలేదన్న విమర్శలున్నాయి. కొన్ని నెలలుగా ఒంటిమిట్టకు వెళుతున్నా.. సౌమ్యనాథాలయం టీటీడీలో ఉందనే భావనలో వారు లేనట్లు కనిపిస్తోందని భక్తులు పెదవివిరిస్తున్నారు.

సౌమ్యనాథా.. ఏదీ అన్నప్రసాదం

ఆలయంలో 108 ప్రదక్షణలు చేస్తే కోరిన కోర్కేలు తీరుతాయని భక్తుల విశ్వాసం.దీంతో శనివారం అధికసంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లానుంచే కాకుండా ఇతర జిల్లాలనుంచి కూడా భక్తులు అధఙక సంఖ్యలో వస్తుంటారు. దేవదాయశాఖ పరిధిలో ఆలయం ఉన్నప్పుడు దాతల సహకారంతో అప్పట్లో చైర్మన్ అరిగెల సౌమిత్రి, పాలకమండలి ఆధ్వర్యంలో ప్రతి శనివారం భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేసేవారు. భక్తులు ఇక్కడే భోజనం చేసుకుని వెళ్లేవారు. ప్రస్తుతం టీటీడీలో విలీనమైనా అన్నప్రసాదాలను అందచేసేందుకు టీటీడీ ముందుకురాలేదు. నందలూరు బస్టాండులో నాన్‌వెజ్ హోటల్స్ ఉండటంతో భోజనం తినడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి అన్నప్రసాదం పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో ప్రాచీన ప్రహరీ: 11వ శతాబ్దంలో చోళవంశరాజు కుళోత్తుంగచోళుడు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చుట్టూ వున్న ప్రహరీగోడ శిథిలావస్థకు చేరుకుంది. దక్షిణ, ఉత్తర, తూర్పు గాలిగోపురాలతో మిళితమైన ప్రహరీగోడ పై భాగం కూలిపోయినా ఇంతవరకు పునర్నిర్మించచలేదు.

భక్తుల దాహార్తి తీర్చని జలప్రసాదం ప్లాంట్

సౌమ్యనాథాలయంలో నిర్మితమైన జలప్రసాదం ప్లాంట్‌ను మూలనపడేశారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు సౌకర్యాల కల్పనపై టీటీడీ దృష్టి సారించలేదు. టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోలేదు. డిప్యూటీ ఈవో, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో భక్తుల సౌకర్యాల కల్పన దిశగా ఎప్పటికప్పుడు నివేదికలు టీటీడీకి వెళుతుండాలి. మరీ అలా జరుగుతుందో లేదో టీటీడీ పాలకమండలికే తెలియాలి.



జలప్రసాదం ప్లాంట్‌ను మూలనపడేసిన టీటీడీ

టీటీడీ బోర్డు దృష్టిసారించాలి



టీటీడీలోకి సౌమ్యనాథాలయం విలీనమయ్యాక ఒంటిమిట్ట రామాలయం తరహాలో అభివృద్ధి చెందుతుందని ఆశించాం. టీటీడీ పాలకమండలి ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలి. శనివారం రోజున టీటీడీ భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేయాలి.
-మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ, నందలూరు

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



గతంలో భక్తులు సహకారంతో ప్రతి శనివారం భక్తుల ఆకలి తీర్చేవిధంగా అన్నప్రసాదాలను పంపిణీ చేసేవారము. టీటీడీలోకి విలీనమైన తర్వాత అన్నప్రసాదాలను పంపిణీ చేయడం లేదు. ఈ విషయంపై టీటీడీ తక్షణమే స్పందించాలి. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.
- అరిగెల సౌమిత్రి, ఆలయ మాజీ చైర్మన్, నందలూరు

క్లుప్తంగా

ఇక చాలు.. దయ చేయండి

- జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగుల తొలగింపునకు కసరత్తు
- 150 మందిని వెళ్లగొట్టేందుకు చర్యలు వేగవంతం
- చిరుద్యోగుల జీవితాలను చిదిమేసేలా త్వరలో ఉత్తర్వులు
- వర్సిటీ ఏర్పడినప్పటి నుంచి ఉన్న ఉద్యోగులకూ ఉద్వాసన

అనంతపురం: ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం మాట తప్పింది. పైగా ఇప్పటివరకూ ఉన్న ఉద్యోగాలనూ తొలగిస్తోంది. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో పనిచేస్తున్న 150 మంది అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు సర్వం సిద్ధం చేయడమే ఇందుకు నిదర్శనం. వివరాలు.. దివంగత నేత వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి హయాంలో 2008లో జేఎన్‌టీయూ (ఏ) వర్సిటీ ఏర్పాటైంది. వర్సిటీలో కార్యకలాపాల నిర్వహణకు అప్పట్లోనే అవుట్‌ సోర్సింగ్‌ కింద ఉద్యోగులను నియమించారు. ప్రస్తుతం వర్సిటీ పరిధిలో మొత్తం 650 మంది ఉన్నారు. కలికిరి ఇంజినీరింగ్‌ కళాశాలలో 120 మంది, పులివెందుల ఇంజినీరింగ్‌ కళాశాల 150, క్యాంపస్‌ ఇంజినీరింగ్‌ కళాశాల 80, ఓటీఆర్‌ఐ 26, జేఎన్‌టీయూ (అనంతపురం నగరంలో)లో 274 మంది పనిచేస్తున్నారు.

అంతలోనే ఎంత తేడా..

చిరుద్యోగులకు దన్నుగా నిలిచేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. 'అప్కాస్‌'ను ఏర్పాటు చేసి ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతం చెల్లించింది. ఉద్యోగాలను ఇష్టానుసారం తొలగించే పరిస్థితి లేకుండా భద్రత కల్పించింది. పీఎఫ్‌ సౌకర్యం ఉండేది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. 'అప్కాస్‌' నుంచి జీతాలు చెల్లించలేమంటూ చేతులెత్తేసింది. దీంతో జేఎన్‌టీయూ అంతర్గత వనరుల నుంచి జీతాలు ఇవ్వాల్సి రావడంతో ఆ మేరకు ఆర్థిక వనరులు లేక ఉద్యోగులను తొలగించాలనే నిర్ణయానికి ఉన్నతాధికారులు వచ్చారు. మూడు రోజుల క్రితం జరిగిన పాలకమండలి సమావేశంలో దాదాపు 150 మంది ఉద్యోగులను తొలగించాలని తీర్మానించినట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో ఉద్యోగుల్లో భయాందోళన నెలకొంది. ఎవరిని ఇంటికి పంపుతారో.. ఎవరిని ఉంచుతారోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో జేఎన్‌టీయూ(ఏ)లో ఇద్దరు, కలికిరిలో ఐదుగురిని మాత్రమే ఉద్యోగాల్లో తీసుకున్నారు. మిగిలిన 643 మంది చాలా ఏళ్ల నుంచి కొనసాగుతున్న వారే. ఈ క్రమంలో వర్సిటీ ఏర్పడినప్పటి నుంచి ఉన్న ఉద్యోగులకూ ఉద్వాసన తప్పదని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వస్తే జీతాలు పెరుగుతాయని ఆశించామని, కానీ ఉన్న ఉద్యోగాలకే ఎసరు పెడతారని కలలో కూడా ఊహించలేదంటూ ఉద్యోగులు వేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏడుగురికి గాయాలు

వేముల : మండల పరిధిలోని భూమయ్య గారి పల్లె క్రాస్‌ వద్ద స్కార్పియో వాహనం బోల్తా పడి ఏడుగురికి గాయాలయ్యాయి. కొండాపురానికి చెందిన ఏడుగురు స్కార్పియోలో పనుల నిమిత్తం పులివెందుల మీదుగా కడపకు వెళ్తుండగా భూమయ్య గారి పల్లె క్రాస్‌ వద్దకు రాగానే ముందు టైర్లు పగలడంతో వాహనం బోల్తా పడింది. ఈప్రమాదంలో 7 మందికి గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం పులివెందుల ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్‌ పరిస్థితి విషమంగా ఉంది.

వాహనాల తనిఖీ

కడప అర్బన్‌ : జిల్లాలో విజిబుల్‌ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ ఈ.జి అశోక్‌ కుమార్‌ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సైబర్‌ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు.

ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం

- తాటిముంజల్లో పుష్కలంగా విటమిన్లు
- భానుడి ప్రతాపంతో హాట్‌ కేకుల్లా తాటిముంజల విక్రయాలు
- ఐస్‌ యాపిల్‌గా ప్రాచుర్యం

రాజంపేట టౌన్‌ : ప్రచండ భానుడి భగభగలతో అల్లాడుతున్న వేసవిలో చల్లని పదార్థాలకు, ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించే పదార్థాలకు మంచి డిమాండ్‌ ఉంటుంది. ప్రస్తుతం భానుడు తన ప్రతాపం చూపుతుండటంతో శరీరానికి చలువచేసే వివిధ పదార్థాలతో ప్రజలు సేద తీరుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా శరీరం డీహైడ్రేషన్‌ కాకుండా మజ్జిగ, కొబ్బరిబోండాలు, పుచ్చకాయలు, పండ్ల రసాలు వంటివి వేసవి తాపాన్ని తీర్చుతున్నాయి. అయితే వేసవిలో తాటిముంజలకు ప్రత్యేక స్థానం ఉంది. వేసవి తాపాన్ని అధిగమించేందుకు, వేసవిలో శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు ప్రకృతి ప్రసాదించిన తాటిముంజలు (ఐస్‌ యాపిల్‌) విశేష ప్రాచుర్యం పొందాయి. తాటిముంజల సీజన్‌ ప్రారంభం కావడం, దీనికితోడు భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో ముంజలకు డిమాండ్‌ ఏర్పడింది. కొంత మంది వ్యాపారులు వైఎస్సార్‌ జిల్లా వేంపల్లె నుంచి తాటిముంజలను రాజంపేటకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. తాటిముంజలు శరీరంలో చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగివున్నందున ముంజల విక్రయాలు హాట్‌ కేకుల్లా సాగుతున్నాయి.

ఆరోగ్య ప్రదాయిని..

ప్రకృతిలో విరివిగా లభ్యమయ్యే తాటిముంజలు కల్తీ లేని, స్వచ్ఛమైనవి కావడంతో ఆరోగ్య ప్రదాయిని అని వైద్యులు కూడా చెబుతున్నారు. ధర ఎక్కువైనా ప్రజలు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. డజను నూరు రూపాయిల నుంచి నూట ఇరవై రూపాయిలకు విక్రయిస్తున్నారు. అనేక మంది ఇవి విక్రయించే ప్రాంతంలో వేచివుండి మరీ కొనుగోలు చేస్తున్నారు. లేతగా ఉండే వాటికి గిరాకీ ఎక్కువగా ఉంది.



కాయ నుంచి తాటిముంజలను బయటకు తీస్తున్న వ్యాపారులు

అనేక ప్రయోజనాలు..

- తాటి ముంజల్లో విటమిన్లు, ఫాస్పరస్‌, థయామిన్‌, బీ–కాంప్లెక్స్‌, కాల్షియం, పొటాషియంతో పాటు సోలెబుల్‌ ఫైబర్‌ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.


తాటిముంజలు

- వీటిలో నీటిశాతం ఎక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్‌ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేసవితాపం, వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది.
- తాటిముంజలు తినడం వల్ల శరీరంలో పేరుకున్న హానికర వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంతో పాటు రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- వేసవిలో ఏటా క్రమం తప్పకుండా తినడం ద్వారా చెడుకొలస్ట్రాల్‌ తగ్గించి, మంచి కొలస్ట్రాల్‌ వృద్ధి చేస్తుంది.
- వేసవిలో వచ్చే చికెన్‌ ఫాక్స్‌ని నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
- చర్మానికి కావాల్సినంత తేమను అందించి చెమట కాయల్ని నివారిస్తుంది.

వ్యాపారం జోరుగా సాగుతుంది



ఎండలు ఎక్కువగా ఉన్నందున తాటిముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. మేము వేంపల్లె నుంచి తాటిముంజలను తీసుకొస్తున్నాము. కొంత మంది తాటిముంజలు ఎప్పుడు వస్తాయా అని వేచివుంటున్నారు. ఖర్చులన్నీ పోను ఆశాజనకంగా మిగులుబాటు ఉంది.

– శివ, తాటిముంజల వ్యాపారి

పోషక విలువలు అధికం



వేసవిలో అధికంగా ఎండలు ఉండటం వల్ల మనిషి శరీరంలో నీటిని కోల్పోతాడు. అందువల్ల శరీరానికి కావాల్సిన పోషకాలను ఎప్పటికప్పుడు అందిస్తుండాలి. తాటిముంజలు వేసవితాపాన్ని తీర్చడంతో పాటు పోషకాలను అందిస్తాయి. వీటిలో ముఖ్యంగా తేమ, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, పీచు పదార్థాలు వంటి పోషక పదార్థాలు ఉంటాయి. ఇవి మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

– డాక్టర్‌ పాలనేని వెంకటనాగేశ్వరరాజు, సూపరింటెండెంట్‌, ప్రభుత్వ ఆసుపత్రి రాజంపేట

పిడుగుపాటుకు యువకుడి బలి

పెద్దముడియం : మండలంలోని చిన్నముడియం గ్రామంలో దండు భాను(22) అనే యువకుడు పిడుగు పాటుకు బలయ్యాడు. జమ్మలమడుగు మండలం ఉప్పలపాడు గ్రా మానికి చెందిన నాగ సుబ్బరాయుడు, రామక్క అనే దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె కలరు. వీరు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవారు. వీరికి మండలంలోని చిన్నముడియం గ్రామంలో పొలం ఉండటంతో కొర్ర పంటను సాగు చేస్తున్నారు. ఆదివారం రోజు మధ్యాహ్నం కొర్ర పంటకు నీరు కడుతుండగా గాలి వాన వచ్చింది. ఆ సమయంలో దండు భానుకు సమీపంలో పిడుగు పడటంతో ఆ శబ్దానికి అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే కన్న కొడుకు మృతి చెందడంతో అక్కడే ఉన్న తండ్రి రోదనలు మిన్నంటాయి. మృతుని కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు టిబిహెచ్‌ఎల్‌సి మాజీ చైర్మన్‌ శ్రీనువాసుల రెడ్డి పరామర్శించారు.

మైనర్‌ బాలికకు ఆశ్రయం కల్పించినందుకు అరెస్ట్‌

మైదుకూరు : కిడ్నాప్‌ అయిన మైనర్‌ బాలికకు వివాహం చేసేందుకు ఆశ్రయం కల్పించినందుకు మండలంలోని తువ్వపల్లెకు చెందిన ఊటుకూరు రఘురామిరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు అర్బన్‌ ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. తువ్వపల్లెకు చెందిన మైనర్‌ బాలిక ఈనెల 14వ తేదీన కిడ్నాప్‌నకు గురైందని, 15వ తేదీ ఆమె తల్లి ప్రమీల ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. కాగా సదరు మైనర్‌ బాలికకు వివాహం చేసేందుకు ఆమెకు రఘురామిరెడ్డి తన ఇంటిలో ఆశ్రయం కల్పించినట్టు తెలిపారు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేశామని, ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్‌ఐ వివరించారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నరసింహులు


యూనీస్‌ మృతదేహం

- నెల్లూరు జిల్లా కదిరినాయుడుపల్లె సమీపంలో రోడ్డు ప్రమాదం
- ఇరువురు బద్వేలు వాసులు మృతి

బద్వేలు అర్బన్‌ : నెల్లూరు జిల్లాలోని పెంచల కోనకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా బైక్‌ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇరువురు బద్వేలు వాసులు మృతిచెందారు. ఆదివారం నెల్లూరు జిల్లాలోని కదిరినాయుడుపల్లె అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అక్కడి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బద్వేలు నియోజకవర్గంలోని అట్లూరు మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన ఎం.నరసింహులు (26) పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. అలాగే పట్టణంలోని రూపరాంపేటకు చెందిన వై.యూనీస్‌ (26) అదే ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఇరువురు కలిసి శనివారం సాయంత్రం బద్వేలు నుండి ద్విచక్ర వాహనంలో పెంచలకోనకు బయలుదేరారు. అక్కడ దైవదర్శనం చేసుకుని రాత్రికి అక్కడే ఉండి ఉదయాన బద్వేలుకు బయలుదేరారు. ఈ క్రమంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిలోని కదిరినాయుడుపల్లె అటవీ ప్రాంతంలోకి వచ్చేసరికి బైక్‌ అదుపుతప్పి చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో యూనీస్‌ అక్కడికక్కడే మృతిచెందగా నరసింహులును స్థానికులు 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆపరేషన్‌ కగార్‌ను ఆపాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : దండకారణ్యంలో భారత ప్రభుత్వం 'ఆపరేషన్‌ కగార్‌' పేరుతో ఆదివాసీలపై చేస్తున్న మారణ హోమాన్ని ఆపాలని సీపీఐ (ఎంఎల్‌) న్యూ డెమోక్రసీ జాతీయ నాయకులు ప్రసాద్‌, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌ రెడ్డి, విప్లవ రచయిత సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు వరలక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌, ఎన్‌ఆర్‌సి, సిపిఎ జేఏసీ కన్వీనర్‌ బాబు బాయ్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం నగరంలోని విశ్వేశ్వరాయ భవన్‌లో జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'ఆపరేషన్‌ కగార్‌ పేరుతో ఆదివాసీలపై నరమేధాన్ని ఆపండి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలను మావోయిస్టుల పేరుతో అంతమొందించడం తగదన్నారు. ఆపరేషన్‌ కగార్‌ను వ్యతిరేకించ వలసిన బాధ్యత భారత దేశ ప్రజలందరిపైన ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు చెందాల్సిన సహజ వనరులైన అటవీ సంపదను, పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలియజేశారు. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన ఆదివాసీ వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ముస్లిం మైనార్టీ వ్యతిరేక మతతత్వ విధానాలను తూర్పారబట్టారు. సమాజంలో వివిధ మత సమూహాల మధ్య సామరస్యతను భగ్నం చేయటానికి బీజేపీ యత్నిస్తోందన్నారు. ఇది ఎంత మాత్రం తగదన్నారు. సామాన్య ప్రజల జీవితాలను అభద్రతకు గురి చేస్తూ, అధికారాన్ని కాపాడుకుంటూ, బహుళ జాతి సంస్థలైన అంబానీ, ఆదానీ, ఎస్సార్‌, వేదాంత లాంటి కంపెనీలకు అక్రమంగా లబ్ధి చేకూరుస్తోందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ద్రాక్షం శ్రీనివాసులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్‌) న్యూ డెమోక్రసీ జాతీయ నాయకులు ప్రసాద్‌

రైల్వే లోకో పైలెట్లకు వసతుల కల్పన

- రూ.60 లక్షలతో ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జి పనులు పూర్తి చేస్తాం
- రైల్వే ఏడీఆర్‌ఎం సుధాకర్‌


మాట్లాడుతున్న రైల్వే ఏడీఆర్‌ఎం సుధాకర్‌

ఎర్రగుంట్ల (జమ్మలమడుగు) : రైల్వే లోకో పైలెట్‌ అండ్‌ గార్డ్స్‌ ఎనిమిది గంటల ప్రయాణం చేసి ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా ఇక్కడ విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించినట్లు రైల్వే ఏడీఆర్‌ఎం సుధాకర్‌ అన్నారు. ఆదివారం ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో ఉన్న రైల్వే రన్నింగ్‌ రూమ్‌ను ఆయన పరిశీలించి అక్కడ లోకో పైలెట్లకు ఉన్న సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ ఆవరణలో 2022లో రూ.97 లక్షలతో గ్రౌండ్‌ ఫ్లోర్‌ను నిర్మించామన్నారు. ఇప్పుడు రూ.1.37 కోట్లతో మహిళలకు, పురుషులకు వేరువేరుగా అన్ని వసతులతో విశ్రాంతి గదిని నిర్మించామన్నారు. ఇక్కడ విశ్రాంతి గది, యోగ, లైబ్రరీ, లోకో పైలెట్లకు అవగాహన కోసం సూచనలు ఇచ్చే ప్రత్యేక గది ఏర్పాటు చేశామన్నారు.

అంతేకాక రూ.60 లక్షతో ఎర్రగుంట్ల ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిని నిర్మిస్తున్నామని ఇది జూన్‌ నెలకు పూర్తి చేస్తామన్నారు. ఎర్రగుంట్ల రైల్వే రన్నింగ్‌ రూమ్‌లో ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. లోకోపైలెట్లకు ప్రత్యేక వంట గది కూడా ఉందని, వారికి ప్రత్యేక మెను ప్రకారం భోజన సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ డీఈఈ వీరయ్య, చీఫ్‌ క్రూప్‌ కంట్రోలర్‌ సిద్దు సాహెబ్‌, ఏడీఈయన్‌ రాధాక్రిష్ణ, ఆర్పీఎఫ్‌ సీఐ శ్రీనివాసులు, చీఫ్‌ లోకో ఇన్‌స్పెక్టర్‌ బాబాజాన్‌, మధుసూదన్‌, పీఎస్‌ రాజు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట

ఖాజీపేట : తుడుమలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ట అత్యంత వైభవంగా జరిగింది. మూడు రోజుల నుంచి ఆలయ విగ్రహప్రతిష్టా కార్యక్రమాలు జరిగాయి. చివరి రోజున అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగింది. ప్రతిష్ట పురస్కరించుకుని బండలాగుడు పోటీలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలిచిన వారికి కమిటీ సభ్యులు బహుమతి ప్రదానం చేశారు.

ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌

విగ్రహ ప్రతిష్టా మహోత్సవం పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, జెడ్పీ చైర్మన్‌ రామగోవిందు రెడ్డి పాల్గొన్నారు. పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఎండోమెంట్‌ ద్వారా రూ. 34లక్షల నిధులు మంజూరుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అందుకు కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ఘన సత్కారం చేశారు.


విగ్రహ ప్రతిష్టలో జెడ్పీ చైర్మన్‌ రామగోవిందు రెడ్డి , మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు

విరిగిన ధ్వజస్తంభం

ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ధ్వజస్తంభం ఏర్పాటు చేసే కార్యక్రమం నిర్వహించారు. అయితే దురదృష్టవశాత్తు ధ్వజస్తంభం విగిరింది. విరిగిన భాగం ఆలయ పైభాగంలో పడింది. ఆలయం పై భాగం కొద్దిమేరకు దెబ్బతింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నా ఎవ్వరికీ ఎలాంటి అపాయం జరగక పోవడం తో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అగ్రహారంలో అమ్మవారి విగ్రహప్రతిష్ట

ఖాజీపేట మేజర్‌ పంచాయితీ లోని అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. ఈ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌, మాజీ మంత్రి డీఎల్‌ రవీంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ జిల్లా కన్వీనర్‌ రాఘవరెడ్డి, ఏపీఎస్‌ ఆర్టీసీ కడప జోన్‌ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్‌ గంగాధర్‌రెడ్డి, కేసీ కెనాల్‌ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్‌ శ్రీనివాసుల రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్‌ మురళీమోహన్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామం, హరిజనవాడకు చెందిన ఎర్రబల్లి గంగాధర్‌ (31) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఒంటిమిట్ట పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంగాధర్‌కు 10 సంవత్సరాల క్రితం వల్లూరు మండలం, కొట్లూరు గ్రామంలో రెడ్డమ్మ అనే మహిళతో వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. గంగాధర్‌ వివాహం చేసుకున్నప్పటి నుండి మద్యానికి బానిస కావడంతో తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. ఎంత చెప్పినా భర్త గంగాధర్‌ మద్యాన్ని మానుకోకపోవడంతో భార్య రెడ్డమ్మ ఐదేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుండి గంగాధర్‌ వద్దకు భార్య రెడ్డమ్మ రాకపోగా మూడు నెలల క్రితం రెడ్డమ్మ మరో వివాహం చేసుకుందని భర్త గంగాధర్‌కు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన గంగాధర్‌ ఇక నేను బతకను.. చనిపోతాను అని బంధువులకు, ఊరి ప్రజలకు చెప్పుకుంటూ ఉండేవాడని, చివరకు ఈనెల 17వ తేది తన ఇంటివద్ద ఉన్న మామిడి తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు గంగాధర్‌ను కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

గాలి వాన బీభత్సం

చింతకొమ్మదిన్నె : ఆదివారం రాత్రి 9 గంటలకు వీచిన ఉధృతమైన గాలులకు, వర్షానికి మండల పరిధిలోని మద్దిమడుగు సుగాలి బిడికి గ్రామంలో పెద్ద చెట్లు విరిగిపడి కొన్ని ఇల్లు దెబ్బ తిన్నాయి, విద్యుత్‌ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్‌ సరఫరా నిలిపివేశారు. గ్రామానికి చెందిన బుక్కే గోమీలమ్మ మేకల మందపై పెద్ద చెట్టు పడడంతో సుమారు 20 పైగా మేకలు మృతి చెందాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అందరూ స్పందించి చెట్టుకొమ్మలను కత్తిరించి మేకలను బయటికి తీయడంతో కొన్ని బతికిపోయాయి. రాత్రి కావడం, విద్యుత్తు లేకపోవడంతో పూర్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.


మృతి చెందిన మేకలు

ఇంటికి పోతుండగా పోలీసులు కొట్టారు

ప్రచార మాధ్యమాలలో ఆవేదన వ్యక్తం చేసిన బాధితుడు నీలకంఠ

సాక్షి టాస్క్‌ఫోర్స్‌ : యర్రగుంట్ల పట్టణంలో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి పోవడానికి నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి ఉండగా యర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్‌ వచ్చి చెప్పేది వినకుండానే చెంపపై కొట్టి, లాఠీతో కొట్టాడని బాధితుడు సింగారపు నీలకంఠ వాపోయాడు. నీలకంఠ బాధతో తనకు జరిగిన దానిపై ప్రచార మాధ్యమాలలో పెట్టాడు. దీనిపై బాధితుడు మాట్లాడుతూ 'మా ఇల్లు ప్రొద్దుటూరు రోడ్డులోని పెట్రోల్‌ బంకు వెనుక ఇందిరమ్మ కాలనీలో ఉంది. నేను శనివారం రాత్రి 11 గంటలకు ఇంటి పోవడానికి నాలుగు రోడ్ల కూడలిలో బస్సు కోసం నిలబడి ఉన్నాను. అయితే బస్సు రాకపోవడంతో నా కుమారుడిని బైక్‌ వేసుకుని రమ్మని ఫోన్‌ చేసి చెప్పాను. అయితే ఆ సమయంలో ఓ కానిస్టేబుల్‌, హోంగార్డు వచ్చి ఏమి ఇక్కడ ఉన్నావే అని అడిగారు. నేను విషయం చెబుతుండగానే నన్ను చెంపపై కొట్టారు.. ఎందుకు కొడుతున్నారని అడిగితే మళ్లీ లాఠీ తీసుకుని చేతి మీద కొట్టారు. రాత్రి సమయంలో ఇంటికి పోవడానికి ఇబ్బందులు పడుతున్న వారిని పోలీసులు దగ్గర ఉండి ఇంటికి చేర్పించాల్సింది పోయి మాపైనే దాడి చేయడం అన్యాయం' అని బాధితుడు ప్రశ్నించాడు. జరిగిన విషయాన్ని తాను ప్రచార మాధ్యమాలలో పెట్టినట్లు తెలిపారు. అతడు పెట్టిన వీడియో ప్రచార మాధ్యమాలలో హల్‌చల్‌ చేస్తోంది. దీనిపై సోమవారం జిల్లా ఎస్పీని కలసి తన బాధను చెప్పుకుంటానని, తనకు న్యాయం చేయాలని నీలకంఠ కోరారు.


మాట్లాడుతున్న నీలకంఠ


లాఠీ దెబ్బలకు వాచిన చేయి

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కడప అర్బన్‌ : జిల్లాలో అగ్నిప్రమాదాల పట్ల నిరంతరం అప్రమత్తంగా వుండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌ నాగరాజు తెలియజేశారు. జిల్లా అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. ఈ వారోత్సవాల ముగింపు సందర్భంగా కడప ఫైర్‌ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ నాగరాజు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలే కాకుండా విపత్తుల, రోడ్డు ప్రమాదాలలో కూడా అగ్నిమాపక శాఖ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తూ ఆస్తి, ప్రాణ నష్టం కలుగకుండా కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానంగా అగ్నిమాపక సేవలను కొనియాడారు. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే ఆయా డిపార్ట్‌మెంట్‌ల వారు అగ్నిమాపక శాఖ వారు వచ్చేలోపు చేపట్టాల్సిన కార్యక్రమాలపై శిక్షణ పొందాలన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వంట గ్యాస్‌ ప్రమాదాలపై, విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ ప్రమాదాలపై అవగాహన ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి బసివిరెడ్డి, కడప అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ నాగరాజు

ఎన్జీఓలకు ఇంటి స్థలాల కోసం కృషి

కడప కల్చరల్‌ : జిల్లాలోని ఎన్జీఓలకు ఇంటి స్థలాలు ఇప్పించేందుకు తగిన కృషి చేస్తామని కో ఆపరేటివ్‌ హౌస్‌ బిల్డింగ్‌ సొసైటీ అధ్యక్షులు లెక్కల కొండారెడ్డి తెలిపారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన లెక్కల కొండారెడ్డి జమా ఖర్చులను సభ్యులకు వివరించారు. సొసైటీకి అందరూ సహకరించాలని కోరారు. ఏపీ ఎన్జీఓ అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు డి.రవికుమార్‌లు మాట్లాడుతూ స్థలాలు రాని సభ్యులకు రాష్ట్ర అధ్యక్షులు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్‌ల సహకారంతో తప్పక స్థలం అందించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్‌ యాదవ్‌, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్‌లు మాట్లాడుతూ ఇంటి స్థలాల విషయంగా ఎలాంటి సందేహాలు, ఆందోళన అవసరం లేదని, తప్పక అందరికీ అందగలవని స్పష్టం చేశారు. సమావేశంలో సొసైటీ పాలకవర్గ డైరెక్టర్లు, ఉమ్మడి కడప జిల్లా తాలూకా అధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ జిల్లా అధ్యక్షులు ఎస్‌ మునెయ్య, పెన్షనర్ల అధ్యక్షులు రామమూర్తి నాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లెక్కల కొండారెడ్డి